ప్రజాశక్తి

శుక్రవారం 25 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సా..గుతున్న విచారణ !



కైలాసపట్నంలో పేలుడు ధాటికి ధ్వంసమైన షెడ్లు (ఫైల్ ఫొటో)

- బాణసంచా తయారీ నివేదికపై నిర్లిప్తత
- అనధికార కేంద్రాల గుర్తింపులో జాప్యం
- అధికారులకు పట్టని కైలాసపట్నం ప్రమాదం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అనుమతుల్లేని బాణసంచా తయారీ కేంద్రాలను గుర్తించే పనిని జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నట్లులేదు. మళ్లీ బాణసంచా ప్రమాదం చోటుచేసుకొనే వరకూ అధికారులకు అనధికార తయారీ కేంద్రాలు గుర్తొచ్చేలాలేవు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగి పది రోజులైంది. ఈ ప్రమాదంతో ప్రభుత్వం, జిల్లా అధికారుల హడావిడితో వారు కళ్లు తెరిచినట్లు అన్పించింది. బాణసంచా కేంద్రాలపై కఠినంగా వ్యవహరిస్తారని ప్రజలు భావించారు. అయితే, ఇప్పటివరకు ప్రమాద కారణాలపై విచారణ నివేదికను బయట పెట్టలేదు. అనుమతులు కలిగిన బాణసంచా కేంద్రాల్లో ప్రమాద నివారణ చర్యలు, భద్రత ఎలావుందో గుర్తించలేదు. అనుమతుల్లేని కేంద్రాలను గుర్తించి, వాటి నిర్వాహకులపై తీసుకున్న చర్యలులేవు. ప్రభుత్వమూ, ప్రభుత్వ యంత్రాంగం మొద్దునిద్రతో అనధికార, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, వ్యాపారాలు జిల్లాలో నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. కైలాసపట్నంలో ఏప్రిల్ 13న బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద విచారణ ఏ స్థాయిలోవుందో కూడా చెప్పకుండా అధికారులు దాటవేస్తున్నారు. ఔషధ, రసాయన పరిశ్రమల ప్రమాద తరహాలో బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రాణ నష్టం జరుగుతోంది. కైలాసపట్నం ప్రమాదంలో మొత్తం పది మంది చనిపోయినా ప్రభుత్వ యంత్రాంగానికి చీమకుట్టినట్లు లేదు.

అధికార, అనధికార బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీల కోసం తహశీల్దార్, ఎస్ఐ, అగ్నిమాపక కేంద్ర అధికారి, పిఆర్ ఎఇ, అసిస్టెంట్ లేబర్ అధికారి, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి కమిటీని నియమించారు. ఈ కమిటీ మండలాల వారీగా తనిఖీలు నిర్వహించి అధికారిక బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రత, అనధికారిక బాణసంచా తయారీ కేంద్రాలు గుర్తించి పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పించాల్సివుంది. కానీ అనధికారిక బాణసంచా కేంద్రాలను గుర్తించే పని ఇప్పటికీ పూర్తికాలేదు. వాటి నిర్వాహకులెవరో తేల్చలేదు. గ్రామాల్లో అనధికార బాణసంచా తయారీ కేంద్రాలను సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒలు అత్యంత సులభంగా గుర్తించే వీలుంది. కానీ అనధికార తయారీ కేంద్రాలను గుర్తించే పనిలో వీరిని భాగస్వాములు చేయలేదు. వీటిని గుర్తించి నివేదిక ఇవ్వడంలో మండల స్థాయి కమిటీ జాప్యం చేస్తోంది. అనధికార మిగతా 2లో..



ఉర్సా భూముల్లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు లోకనాథం, జగ్గునాయుడు, గంగారావు, మూర్తి

పర్యావరణాన్ని ధ్వంసం చేసి ఉర్సాకు వత్తాసా ?

- డొల్ల కంపెనీకి 60 ఎకరాలు కేటాయింపా ?
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం
- విశాఖలో కేటాయించిన భూములను పరిశీలించిన పార్టీ బృందం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అత్యంత విలువైన, పర్యావరణ రక్షణకు కవచాల్లా ఉండే విశాఖలోని ఐటి హిల్స్, కాపులుప్పాడ కొండలపై 'డొల్ల' కంపెనీ ఉర్సాకు సుమారు 60 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం దారుణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన ప్రభుత్వమే పర్యావరణాన్ని విధ్వంసం చేయడం తగని పని అని తెలిపారు. గురువారం విశాఖలోని ఐటి హిల్ నెంబర్ 3లో టిసిఎస్‌కు కేటాయిచిన 21 ఎకరాలను, ఆ పక్కనే 'ఉర్సా' కంపెనీకి కేటాయించిన మూడున్నర ఎకరాలను పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉర్సా కంపెనీకి విశాఖలో ఐటి హిల్ - 3లో 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో మరో 56.36 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని, వీటి విలువ సుమారు రూ 3 వేల కోట్లు అని తెలిపారు. ఈ కంపెనీ సుమారు రూ.5278 కోట్లు పెట్టుబడితో డేటా సెంటరు నెలకొల్పుతుందని, దీని ద్వారా 2500 మందికి ఉద్యోగాలు మిగతా 2లో..

భవన నిర్మాణ కార్మికుల ధర్నాలు

వార్త 8లో..

26న జివిఎంసి డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

వార్త 2లో..

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

వార్త 6లో..



చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఉగ్రదాడి మృతుడు చంద్రమౌళికి ఘన నివాళి

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన పవన్, డోలా, షర్మిల వార్త మెయిన్‌లో..

పారిశ్రామిక ఔత్సాహికులకు సహకారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక ఔత్సాహికులకు అన్ని విధాలుగా పూర్తి సహకారం అందించాలని సంబంధిత అధికారులను విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఇప్పటికే నడుస్తున్న పారిశ్రామిక కేంద్రాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అక్కడ నుంచి వచ్చే వినతులపై వేగంగా స్పందించి చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ భవనంలో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. 2025-26 వార్షిక ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని ఔత్సాహికులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పాలని పేర్కొన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆరా తీశారు.

అలరించిన మినీ బాలోత్సవం

ఆకట్టుకున్న కళారూపాలు



నృత్యాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆసరా వార్షిక సమావేశంలో భాగంగా గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విసిసి, ఆసరా మినీ బాలోత్సవం - 2025 ఎంతగానో అలరించింది. ప్రారంభ సభలో విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షులు వినయ్ గాంధీ, ఆసరా ఛారిటబుల్ సొసైటీ సభ్యులు సుధ, శోభ, సంజయ్, డాక్టర్ కె.రమాప్రభ, విసిసి కన్వీనర్ కె.సుశీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. చదువుల ఒత్తిడి నుంచి అందరికీ ఇది ఒక ఆటవిడుపు అని పేర్కొన్నారు. సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. విసిసి పది సంవత్సరాలుగా బాలల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రమాప్రభ చెప్పారు. ట్యూషన్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మినీ బాలోత్సవంలో 500 మంది విసిసి క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు. చిత్ర లేఖనం, కథ చెప్పడం, మెమొరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, బృంద నత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాసరచన, క్విజ్ వివిధ కేటగిరీలలో 13 రకాల పోటీ అంశాలు, 21 ఈవెంట్స్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పర్యావరణాన్ని ధ్వంసం చేసి ఉర్సాకు వత్తాసా ?

వస్తాయని ప్రకటించిందని, ఆ విషయాలు నమ్మశక్యంగా లేవని అన్నారు. ఐటి రంగంలో కనీస అనుభవం లేని, రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసుకున్న 'ఉర్సా' డేటా సెంటర్‌కు ఎలా చంద్రబాబు ప్రభుత్వం భూములిచ్చేస్తుందని, తక్షణమే కేటాయింపులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు.

ఇది పూర్తిగా రాజకీయ అవినీతి, ఆశ్రితపక్షపాతం

డేటా సెంటర్ ప్రాజెక్టు ముసుగులో రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డొల్ల సంస్థకు ఏకంగా 60 ఎకరాల విలువైన భూమిని ఎకరా 0.99 పైసల చొప్పున ఇవ్వడం అంటే ఇది పూర్తిగా రాజకీయ అవినీతని, తన అనుయాయులకు కట్టబెట్టే ఆశ్రితపక్షపాతమని లోకనాథం విమర్శించారు. అభివృద్ధి పేరిట కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున విలువైన భూములను బడా సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. రూ.70 వేల కోట్లతో డేటా సెంటర్ నెలకొల్పుతారనే పేరిట 2019లో చంద్రబాబు మధురవాడలో సుమారు 134 ఎకరాలను అదానీకి కేటాయించారని, దానికి ఇప్పటికీ అతీగతీ లేదని విమర్శించారు. ఇటీవల భీమిలి దగ్గర రిసార్ట్స్, హోటల్ పేర వందల ఎకరాలను కేటాయింపులు చేశారని, విశాఖ నగర నడిబొడ్డులో ఉన్న రెండు వేల కోట్ల విలువ కలిగిన 13.50 ఎకరాల భూమిని అప్పనంగా లులూ మాల్‌కు కట్టబెట్టారని అన్నారు. ఇలా అభివృద్ధి, ఉద్యోగాల ముసుగులో పెద్దఎత్తున భూదోపిడీ, భారీ అవినీతి చోటు చేసుకున్నాయని తెలిపారు.

పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత విశాఖలో వివిధ ప్రైవేట్ సంస్థలకు జరిగిన భూ కేటాయింపులు, ప్రస్తుత పరిస్థితి, అలాగే ఇప్పటి వరకు ఐటి సంస్థలకు కేటాయించిన భూములు, స్థాపించిన సంస్థలు, వచ్చిన ఉద్యోగాలు, వారి వేతనాలు, ఎంఒయులు, ఉల్లంఘనలు, ఖాళీగా ఉన్న భూములు, తీసుకున్న చర్యలు తదితర వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం భూకేటాయింపుల శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉర్సా పూర్తిగా డొల్ల కంపెనీ అని, కూటమి ప్రభుత్వంలో ఉన్న బడా నాయకునికి చెందిన బినామీ అని కూడా ప్రచారం జరుగుతోందని, ఇప్పటికే మీడియా ఈ సంస్థ యాజమాన్యం, దాని మూలాలు, అక్రమ రాజకీయ బంధాలను బట్టబయలు చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే ఆఘమేఘాల మీద అమెరికాలో గత ఏడాది సెప్టెంబర్ 27న, ఆ తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 12న హైదరాబాద్‌లో కంపెనీని రిజిస్టర్ చేశారని, పై పెచ్చు ఆ కంపెనీ కేవలం అధీకృత పెట్టుబడిగా రూ.10 లక్షలు మాత్రమే చూపించిందని అన్నారు. దీంతోనే ప్రభుత్వంలోని కొందరి బినామీ సంస్థని స్పష్టంగా తేలిపోయిందని తెలిపారు. ఈ సంస్థ రూ.5278 కోట్లు పెట్టుబడి పెడుతుందని చెప్పడం వెనుక ఖరీదైన భూములను అప్పనంగా కొట్టేయడానికేనన్న విషయం దాగి ఉందన్నారు. ఇప్పటికే ఆ సంస్థ వెనుక విజయవాడ టిడిపి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఉన్నాడని, అతని బినామీ అయిన అబ్బూరి సతీష్ ఈ డొల్ల కంపెనీలో డైరెక్టర్ అని, గతంలో ఆయన చేసిన మోసాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. వీటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సా..గుతున్న విచారణ !

బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులు పలుకుబడి కలిగినవారు వారుకావడంతో వారి జోలికి వెళ్లడానికి జిల్లా అధికారులు సాహసం చేయడంలేదన్న ప్రచారం వుంది. ఎక్కువగా కోటవురట్ల, సబ్బవరం, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం ప్రాంతాల్లో అనధికారిక బాణసంచా తయారీ కేంద్రాలు నడుస్తున్నాయి. జిల్లాలో మొత్తం 40 బాణసంచా తయారీ కేంద్రాల్లో 21 కేంద్రాలకు అనుమతులున్నాయని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత గతంలో వెల్లడించారు. మంత్రి ప్రకటించిన వివరాల ప్రకారం అనధికారికంగా నడుస్తున్న 19 కేంద్రాలను మండలాల వారీగా గుర్తించి, నిర్వాహకులపై చర్య తీసుకోకపోవడం పలు అనుమానాలకు, విమర్శలకు దారితీస్తోంది.

అలరించిన మినీ బాలోత్సవం

నిర్వహించారు. జడ్జీలుగా దండు నాగేశ్వరరావుతో కూడిన 30 మంది బృందం వ్యవహరించారు. ప్రారంభ కార్యక్రమంలో విసిసి కన్వీనర్లు డి.శైలజ, మణి, అరుణ, స్వర్ణలత, సరోజిని, సంధ్య, వర్షిణి, విజయలక్ష్మి, లీలావతి, దీపిక, నీలవేణి, గుణ శంకర్, సతీష్, శశి కుమార్, అప్పారావు, నిఖిల్, శ్రావణి, గీతాంజలి పాల్గొన్నారు.

రీ సర్వే, రెవెన్యూ అంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రీ సర్వే ప్రక్రియ, రెవెన్యూ పరమైన అంశాలపై క్షేత్రస్థాయి సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే విధి నిర్వహణ సజావుగా సాగుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ పేర్కొన్నారు. సర్వే ల్యాండ్ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం ఒక్కరోజు వర్క్ షాప్ నిర్వహించారు. వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు.

వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ :రానున్న వేసవిలో ప్రయాణికుల రద్దీని తగ్గించే క్రమంలో విశాఖపట్నం - చెర్లపల్లి, సంబల్పూర్ - ఈరోడ్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 08579 విశాఖపట్నం- చెర్లపల్లి ప్రత్యేక రైలు ఏప్రిల్ 25, మే 2, 9, 16, 23, 30 తేదీల్లో సాయంత్రం 5.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చెర్లపల్లి చేరుకుంటుంది. 08580 చెర్లపల్లి - విశాఖపట్నం స్పెషల్ రైలు ఏప్రిల్ 26, మే 3, 10, 17, 24, 31 తేదీల్లో సాయంత్రం 7 గంటలకు చెర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. అదేవిధంగా 08311 సంబల్పూర్ - ఈరోడ్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 7 నుంచి జూన్ 25 వరకు ప్రతి బుధవారం ఉదయం 11:35 గంటలకు సంబల్పూర్ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 9:30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది మరల 9.32 గంటలకు బయలుదేరి గురువారం రాత్రి 8.30 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది.

08312 ఈరోడ్ - సంబల్పూర్ వీక్లీ స్పెషల్ రైలు మే 9 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2:45 గంటలకు ఈరోడ్ నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం గంటలకు 13:08 దువ్వాడ చేరుకుని మరల 13:10 బయలుదేరి అదేరోజు రాత్రి 23:15 గంటలకు సంబల్పూర్ చేరుకుంటుంది.

చంద్రమౌళికి విసిసి, ఆసరా నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన విశాఖ వాసి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళికి వైజాగ్ చిల్డ్రన్స్‌క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ నివాళులు అర్పించాయి. విసిసి వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ చంద్రమౌళి స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నప్పటి నుంచి ఆసరా చారిటబుల్ సొసైటీలో సభ్యులుగా ఉంటూ ఉదారంగా ఆర్థిక సహాయం అందించేవారని, సేవా కార్యక్రమాల నిమిత్తం గిరిజన గ్రామాలకు వెళ్లేవారని తెలిపారు. ఎంతో సౌమ్యంగా ఉంటూ విద్యార్థులకు సలహాలు సూచనలు ఇచ్చే వారన్నారు. కరోనా సమయంలో మహిళల కోసం ఆసరా ద్వారా కుట్టు శిక్షణ కేంద్రాలు నెలకొల్పడంలో కృషి చేశారన్నారు. విసిసి విద్యార్థుల చదువు కోసం అడిగితే కాదనకుండా సహాయం అందించేవారని కొనియాడారు. చంద్రమౌళి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో ఆసరా సభ్యులు సుధ, సంజీవ కుమార్,శోభ , విసిసి నాయకులు, పిల్లలు పాల్గొన్నారు.

26న జివిఎంసి డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈ నెల 26న శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశం మందిరంలో కార్పొరేషన్ సమావేశాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న ఎక్స్‌అఫిషియో మెంబర్లు, వార్డు మెంబర్లు కౌన్సిల్ హాల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన పిదప వారి మొబైల్స్‌ను ఫ్లైట్‌మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లకు సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో వరల్డ్ టేబుల్ టెన్నిస్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశాఖ జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను, వారి తల్లిదండ్రులను, కోచ్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ఐసి సీనియర్ డివిజన్ మేనేజర్ శారద ప్రసాద్‌దాస్ హాజరయ్యారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ జనరల్ సెక్రెటరీ అవార్డు గ్రహీత ఉష ప్రత్యేక అతిథిగా విచ్చేశారు.

ఉచిత వంట గ్యాస్‌ను సక్రమంగా అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తానన్న హామీని నిలబెట్టుకొని, ఆ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహిళలు వంటగ్యాస్ సిలిండర్లను మోస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బి.పద్మ, జగదాంబ జోన్ అధ్యక్షులు కె.మణి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ పథకానికి చెల్లించిన సబ్సిడీ సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. దీపావళికి ఒక సిలిండర్ ఇచ్చారని, మరొక సిలిండర్ దీపావళి వచ్చేవరకూ ఇవ్వరా ? అని ప్రశ్నించారు. ఈసరికే వంట గ్యాస్ బుక్ చేసి, సిలిండర్‌కు డబ్బు చెల్లించిన వారికి సబ్సిడీతో సహా మొత్తం సొమ్మును పూర్తిగా చాలా మందికి చెల్లించలేదన్నారు. చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందింది. మరొక మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు అందజేసిన సమాచారం ప్రకారం.. కంచరపాలెం సమీపంలో బర్మా క్యాంపునకు చెందిన నిమిడిపల్లి మేరీ (62), ఆమె కుమార్తె సుధారాణి ఇద్దరూ స్కూటీపై తెల్లవారుజామున కంచరపాలెంలోని చర్చికి వెళ్లి తిరిగి వస్తూ ఊర్వశి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా, విజయవాడ నుంచి విశాఖ వైపు వస్తున్న బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో వెనుక కూర్చున్న మేరీ అక్కడికక్కడే మృతి చెందగా, స్కూటీ నడుపుతున్న కుమార్తె సుధారాణికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సుధారాణిని ఆసుపత్రికి తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సిఐ దాశరథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - నక్కపల్లి : ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారిపడి నక్కపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు దమ్ము అప్పలకొండ (41) మృతి చెందాడు. బుధవారం తాటిచెట్టు ఎక్కి కమ్ములు కొడుతుండగా జారిపడడంతో అప్పలకొండ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే తుని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో బుధవారం రాత్రి మృత్యువాత పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి వెంకట్రావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-రోలుగుంట : రోలుగుంట మండలం వడ్డిపలో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. వడ్డిప నుంచి రాజన్నపేటకు వెళ్లే రహదారి పక్కన తోటలో మృతదేహాన్ని ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికపై జనసేన సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : జనసేన నగర అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జివిఎంసి జనసేన ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మి ఆధ్వర్యాన సీతంపేటలోని కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీన జరిగే డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానంపై చర్చించారు. ఈ అవిశ్వాస తీర్మానంలో జనసేనకు చెందిన 14 మంది కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరుకావాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గోవింద్‌రెడ్డి, మూర్తియాదవ్, మేరీ జోన్స్, సాధిక్, కందుల నాగరాజు, ఉషశ్రీ, కామేశ్వరి, సూర్య కుమారి, వంశీరెడ్డి, బెహరా భాస్కరరావు, ఆళ్ల లీలావతి, యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ పాల్గొన్నారు.

కెకె.రాజుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కెకె రాజును 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, 42వ వార్డు వైసిపి నాయకులు, వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతంతో బార్క్ అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి-మధురవాడ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సాంకేతిక సహకారాన్ని అందించడానికి కృషి చేస్తున్న బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) అకృతి కార్యక్రమాన్ని (అడ్వాన్స్‌డ్ నాలెడ్జి అండ్ రూరల్ అండ్ అర్బన్ టెక్నాలజి ఇంప్లిమెంటేషన్) విశాఖలో అమలు చేయడానికి వీలుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజి ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్)తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా సమక్షంలో గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, డిఎఇ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అండ్ కొలాబరేషన్ డివిజన్ అధిపతి డేనియల్ బాబు అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డేనియల్ బాబు మాట్లాడుతూ అణుశక్తి పరిశోధనలను సమాజ హితానికి ఉపయోగించడంలో భాగంగా బార్క్‌లో అకృతి కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం పారిశ్రామిక ప్రగతికి ఉపయోగపడాలన్నది తమ లక్ష్యం అని చెప్పారు. విశాఖలో గీతం ద్వారా తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలకు అందించడంతో పాటు నూతన ఆవిష్కరణలపై కృషి చేస్తామన్నారు. పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా జి-టెక్ ద్వారా కొత్త అధ్యయనాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్క్ అకృతి కార్యక్రమ సైంటిఫిక్ ఆఫీసర్ భారతి ఎ.బలేరియా, జి-టెక్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు, గీతం విశిష్ట ప్రొఫెసర్లు జి.రవికుమార్, ప్రొఫెసర్ బివిఆర్.టాటా, భౌతిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారతి కళా విహార వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గుడివాడ విజ్ఞాన విహార్‌లో ఉన్న భారతి కళా విహార వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 46 మంది విద్యార్థులు వివిధ కృత్తులు, వర్ణనలు దేశభక్తి, సామాజిక గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవకుడు బాలి రవి మాట్లాడుతూ, సంగీతానికి పశుపక్షాదులను సైతం మైమరిపించగల శక్తి కలదన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సంగీతం నేర్పించాలన్నారు. ఆల్ ఇండియా గ్రేడ్ ఆర్టిస్టు రాధ పిల్లల పాటలను అభినందించారు. పిల్లలకు మక్కువ కలిగించడానికి చదువుతోపాటు సంగీతం, ఇతర లలిత కళలు నేర్పించడానికి 30 సంవత్సరాల నుంచి ఈ భారతి కళావిహార కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆరోగ్యమే మహాభాగ్యం అని పలువురు వాకర్స్ అన్నారు. స్థానిక జమ్మి చెరువు పార్కు వద్ద గురువారం అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సంస్థ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. నేడున్న యాంత్రిక జీవితంలో ఎవరి స్థాయిలో వారు ఒత్తిడికి గురవుతున్నారని, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు వ్యాయామం, నడక అవసరమని పలువురు స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్లు కె.రత్నాజీ దంపతులతో పాటు జి.సత్యనారాయణరెడ్డి, జి.పండరీనాథ్ తదితరులను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎన్.జనార్ధనరావు, దత్త ఈశ్వరరావు, శంకర్‌కుమార్, కె.అప్పారావు, యువభారత్ భీమిలి శాఖ కన్వీనర్ ఎస్.జోగారావు, హేమంత్ శేఖర్, శేషు తదితరులు పాల్గొన్నారు.

కాపులుప్పాడ డంపింగ్ యార్డులో మంత్రి డోలా పర్యటన

ప్రజాశక్తి- కొమ్మాది : మధురవాడ కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పర్యటించారు. నిర్వహణ పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిందాల్ పరిసరాల్లో మొక్కలు నాటి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, అదనపు కమిషనర్ వర్మ, సిఎంఒహెచ్ నరేష్, జోన్ -2 ఆరోగ్య అధికారి కిషోర్, జిందాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షలు తప్పిన వారికి ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : పదోతరగతి పరీక్షలు తప్పిన వారికి మే నెలలో జరుగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు త్వరలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు. మండలం, జివిఎంసి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది 83 శాతం ఉత్తీర్ణత సాధించారని గతేడాదితో పోలిస్తే ఒక శాతం పెరిగిందని పేర్కొన్నారు. 1209 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 1014 మంది (83 శాతం) ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఇందులో 500 పైబడి మార్కులు సాధించిన వారు 288 మంది ఉన్నారని పేర్కొన్నారు. గతేడాది 1205 మంది పరీక్షలు రాయగా 989 మంది (82 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాలు ఈ స్థాయిలో సాధించినందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

శ్రీ భారతిలో శత శాతం ఉత్తీర్ణత



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ రామారావు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురంలో ఉన్న శ్రీ భారతి విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో శత శాతం ఫలితాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ దొంతల రామారావు తెలిపారు. పాఠశాల నుంచి తొమ్మిది మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. పల్లి వర్షిణి 560, సియాద్రి సాయిసింధు 530, నరవ జస్వంత్ 515, బంటుపల్లి గాయని 490, ఆకుల హర్షవర్ధన్ 465, కంది శైలు 445, గొలగాని హరేంద్ర 435, రౌతు పవన్ కుమార్ 416, బంటుబిల్లి లోకేష్ 324 మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ, ఇంటర్మీడియట్‌లో కూడా బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రామారావు, ప్రిన్సిపల్ కృష్ణ, ఉపాధ్యాయులు శంకర్ రాజబాబు, రాంబాబు, పైడిరాజు, ఉమామహేశ్వరి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టి అభినందనలు తెలిపారు.

తాటితూరు జెడ్‌పి హైస్కూల్లో 74 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -భీమునిపట్నం : పదో తరగతి ఫలితాల్లో మండలంలోని తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు తెలిపారు. 78 మంది పరీక్షలు రాయగా 58 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 500 మార్కులు పైబడి 14 మంది సాధించారని, మొదటి స్థానంలో 40 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. బి.రుతిక్‌రెడ్డి 561, ఆర్.సంపత్ వినాయక 551, ఎస్.మనీషా 546 మార్కులు సాధించారని తెలిపారు. వీరందరినీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు, ఎస్ఎంసి ఛైర్మన్ బి.సోమేశ్వరరావు తదితరులు అభినందించారు.

సెయింట్ ఆన్స్ పాఠశాలలో..

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ ట్రీసా మేరీ, ప్రిన్సిపల్ క్రిస్టీ జాన్ తెలిపారు. టివి.సాయివర్షిత్ 586, జోగ ఉషశ్రీ 583, జీరు చాందినీ ప్రియ 582 మార్కులు సాధించారని తెలిపారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం పంచాయతీ దొంతల వారి కళ్లాలకు చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... దొంతల వారి కళ్లాలకు చెందిన దొంతల అప్పలనాయుడు, రమణమ్మ దంపతుల చిన్న కుమారుడు దొంతల సుధీర్ (24) చదువుకొని పలుచోట్ల కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం తల్లి మరణించడంతో సుధీర్ మనస్తాపం చెందడంతో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. గత కొంతకాలంగా పచ్చకామెర్లు వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గడ్డి మందును కూల్ డ్రింక్‌లో కలుపుకొని కళ్లాల వద్ద తాగాడు. తర్వాత సోదరుడు రమేష్‌కు ఫోన్ చేసి చాలా దాహంగా ఉందని గడ్డి మందు తాగానని చెప్పాడు. రమేష్ స్నేహితులు వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే తగరపువలస ఎన్ఆర్ఐ హాస్పిటల్ తరలించారు. పరిస్థితి విషమించడంతో కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును ఎస్ఐ పందిరి శివ ఆధ్వర్యాన హెడ్ కానిస్టేబుల్ బి.ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసులో ఏడాది జైలు శిక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసిన కేసుకు సంబంధించి గత నెల 4వ తేదీన తీర్పు ఇవ్వాల్సి ఉండగా కోర్టుకు హాజరు కానందున జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ గ్రామానికి చెందిన ముద్దాయి కె.అప్పలరాజు (35)కు స్థానిక కోర్టు ఎన్‌బిడబ్ల్యు జారీ చేయగా గురువారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. అప్పలరాజుకు ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష, బాధితురాలైన భార్య కుమారికి రూ.10 వేలు ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

నేల బావిలో పడి గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి నేలబావిలో పడి మృతి చెందినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం.... నారపాడు గ్రామానికి చెందిన నంబారు సన అప్పారావు (59) ఈనెల 22న గొర్రెల మందను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం గొర్రెలు ఇంటికి వచ్చాయిగాని అప్పారావు రాలేదు. దీంతో కుటుంబీకులు గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. 23న గ్రామంలోని పొలాల్లోనూ, బావుల్లోనూ వెతగ్గా ఓ నేలబావిలో అప్పారావు మృతదేహాన్ని కుటుంబీకులు గుర్తించారు. ఈ మేరకు అప్పారావు కుమారుడు నంబారు లోవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చౌడువాడ శివారు మల్లంపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన వంటాకు వెంకటరమణ(49) సాయంత్రం తమ పొలంలో ఉన్న విద్యుత్ మోటార్ తిరగకపోవడంతో దగ్గర్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న ఫ్యూజ్ బాక్స్‌ను పట్టుకొని ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ షాకు గురై పడిపోయాడు. అది గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య సత్యవతి కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం జమ్మాదులపాలెం గ్రామ శివారు కరకవాని పాకల వద్దన నాటుసారా విక్రయిస్తున్న కరకరాజు అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కరకరాజు నుండి 3 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సిబ్బంది ఎంవిఎస్.రమేష్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు ప్రాంతంలో మామిడి తోటలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేస్తున్నట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఏడు గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.35,230 నగదును స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి- గోపాలపట్నం : స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన గోపాలపట్నం హైస్కూల్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ముందుగా జాబ్ మేళాను విశాఖ ఎంపీ శ్రీభరత్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ప్రారంభించారు. సుమారుగా 60 కంపెనీల ప్రతినిధులు, హెచ్‌ఆర్‌లు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 3000 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 1000 మందికి పైగా నిరుద్యోగులను ఆయా కంపెనీలు ఎంపిక చేసుకొని నియామకపత్రాలను అందించాయి.

ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, మెగా జాబ్ మేళా నిర్వహించినందుకు ఎమ్మెల్యే గణబాబును అభినందించారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను అభినందించారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, తాను ఈ స్కూల్లోనే చదువుకున్నానని తెలిపారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, టిడిపి నాయకులు మౌర్యసింహ, బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్, శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి బ్లడ్ కేన్సర్

- దాతల సాయం కోసం ఎదురుచూపు


చికిత్స పొందుతున్న లియా

ప్రజాశక్తి- పెందుర్తి : ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉన్న ఓ కుటుంబంలో చిన్నారికి బ్లడ్ కేన్సర్ సోకడంతో ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతోంది. పెందుర్తి మండలం, వాలిమెరక జుత్తాడ గ్రామానికి చెందిన మువ్వల రమేష్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి మువ్వల లియా (5) కుమార్తె ఉంది. మూడు నెలల కిందట ఆడుకుంటూ లియా కింద పడిపోయింది. అప్పటినుంచి జ్వరం వస్తూ ఎప్పటికీ తగ్గడం లేదు. దీంతో చిన్నారికి అన్ని వైద్య పరీక్షలు చేయగా బ్లడ్ కేన్సర్‌గా వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఈ చిన్నారి విశాఖ కెజిహెచ్ కేన్సర్ వార్డులో చికిత్స పొందుతుంది. మెరుగైన వైద్య సేవలకు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని, దాతలు ముందుకొచ్చి తన కుమార్తె వైద్యం కోసం ఆర్థికంగా చేయూత నివ్వాలని లియా తండ్రి మువ్వల రమేష్ కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాలనుకున్న దాతలు మువ్వల రమేష్ 7893769198 నెంబర్‌కు పంపాలని విజ్ఞప్తిచేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : మల్కాపురం సబ్ స్టేషన్ పరిధి 11 కెవి ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఇఇ బికె.నాయుడు తెలిపారు. 11 కెవి వాటర్ వర్క్స్, దుర్గానగర్ 11కెవి ఫీడర్ మరమ్మత్తు పనుల్లో భాగంగా జివిఎంసి పంప్ హౌస్, ఈఎస్ఐ హాస్పటల్, ఐఎంయు, పోస్ట్ ఆఫీస్, మసీద్ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, దుర్గానగర్ 11 కెవి మరమ్మతు పనుల్లో భాగంగా దుర్గానగర్, ఎఎస్ఆర్.కాలనీ, జిఎ.కాలనీ, ఎన్‌టిఆర్.కాలనీ తదితర ప్రాంతాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఇఇ బికె.నాయుడు కోరారు.

మధురవాడ : కొమ్మాది సబ్ స్టేషన్ పరిధి ఎన్‌టిఆర్.నగర్ ఫీడర్‌పై మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జోన్ 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. కె3.కాలనీ, నవోదయ స్కూల్, డిఆర్‌కె టౌన్‌షిప్, అన్నంరాజునగర్, సాయిచంద్ర లే-అవుట్, గాయత్రి కాలేజీ కో-ఎడ్యుకేషన్, అష్టలక్ష్మి టెంపుల్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం, బోని ఇండస్ట్రియల్ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ మండల ఎఇ అప్పలనాయుడు తెలిపారు. పెద్దిపాలెం, ఆనందపురం సుఖీభవ లే-అవుట్, పొడుగుపాలెం ఇండస్ట్రియల్, ఏనుగులుపాలెం, చందక, పొడుగుపాలెం, వెంకటాపురం, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులవాడ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉగ్రదాడి మృతులకు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి- యంత్రాంగం

కశ్మీర్ పహల్గామ్‌లోఉగ్రవాద దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన కొవ్వొత్తులతో గురువారం ప్రదర్శనలు నిర్వహించారు. మృతులకు ఘన నివాళులర్పించారు.

ప్రతి ఒక్కరూ ఖండించాలి : లోకనాథం

అనకాపల్లి : అనకాపల్లి ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన బెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి, విశాఖ వాసి రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి మృతికి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇంతటి దారుణానికి పాల్పడిన కిరాతకులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడులపై మతం రంగుపులిమి ఘర్షణలు సృష్టించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పర్యాటకులతో రద్దీగా వుండే ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడంతో పాటు ఈ దాడులపై ఇతర కోణాల్లో తక్షణమే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషాద సమయంలో ఉగ్రవాద, ఛాందసవాద శక్తులకు వ్యతిరేకంగా దేశ ప్రజలు నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరావు, గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కె.తెల్లయ్యబాబు, కె.ఈశ్వరరావు, యేసు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఉగ్రదాడిని నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ ఖండించింది. దాడిలో మృతిచెందిన వారికి నివాళ్లర్పిస్తూ డాక్ యార్డ్ విజయనగర్ గేటు వద్ద కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. యూనియన్ గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్, అధ్యక్షులు శేఖర్, టిఎన్‌టియుసి నాయకులు నాగార్జున, నేవల్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి వై.రాజేష్, రామసత్య నారాయణ, ఉమా శంకర్, పాండే, రంజన్ దాస్, పరమేష్, సుధారాణి పాల్గొన్నారు.



అనకాపల్లిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

కేంద్ర నిఘా వైఫల్యం : జగ్గునాయుడు

గాజువాక : కేంద్ర నిఘా వైఫల్యంతోనే కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి జరిగిందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, సిపిఎం స్టీల్‌జోన్ కమిటీ ఆధ్వర్యాన గురువారం సాయంత్రం హెచ్‌బి కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కశ్మీర్‌లోనూ, కేంద్రంలోనూ బిజెపి ప్రభుత్వాలు ఉండగా ముష్కరులు ఏ విధంగా వచ్చారని, ప్రజల్ని కాల్చిన తర్వాత ఏ విధంగా తప్పించుకోగలిగారని బిజెపి ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఆర్టికల్ 370, నోట్లు రద్దు చేస్తే ఉగ్రవాదం ఉండదని చెప్పిన బిజెపి పాలకులు దీనికి ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తమ రాజకీయం కోసం కశ్మీర్‌లో మతవిద్వేషాలను బిజెపి రెచ్చగొట్టిందని విమర్శించారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉగ్ర దాడి మృతులకు సిపిఎం తరపున సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు.రామస్వామి, బి.వెంకట్రావు, బైరెడ్డి గుర్రప్ప, పాల అప్పలరెడ్డి, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ పాల్గొన్నారు.

ఉక్కునగరం : సిపిఎం స్టీల్‌జోన్ కమిటీ ఆధ్వర్యాన ఉక్కునగరంలోని ఉక్కు అమరవీరుల కొవ్వొత్తుల పార్కు వద్ద, ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఉగ్రవాదుల దాడిని పిరికి పంద చర్యగా పేర్కొంటూ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు ఎంతటి వారైనా తక్షణం పట్టుకొని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, నాయకులు వైటి.దాస్, ఎస్‌కె.మొహిద్దీన్, కె.సత్యనారాయణ, సిపిఎం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాజువాకలో కొవ్వొత్తుల ర్యాలీలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



ఉక్కునగరంలోని కొవ్వొత్తుల పార్కు వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

పుస్తకాలు చదవడం మంచి అలవాటు

ప్రజాశక్తి -గాజువాక : పుస్తకాలు చదవడం మంచి అలవాటు అని జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన శ్రీనగర్ సుందరయ్య కాలనీలోని రవీంద్ర ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పుస్తక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, కానీ మంచి పుస్తకం కొనుక్కో' అని కందుకూరి విరేశలింగం చెప్పిన సూక్తి గురించి వివరించారు. అందరూ పుస్తకాలను చదవాలని పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరుశురాం మాట్లాడుతూ, ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన 'పుస్తకాలు పిలుస్తున్నాయి' అనే నినాదంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు తదితర పుస్తక ప్రియులందరీ వద్దకు పుస్తకాలను తీసుకెళ్లాలని ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక గాజువాక జోన్ కమిటీ కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ, సామాజిక అంశాలపై జన విజ్ఞాన వేదిక ప్రచురించిన పుస్తకాలను అందరూ చదవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నూకరత్నం, తులసీరత్నం, కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమేష్‌కుమార్ తదితరులు

శంకర్ ఫౌండేషన్‌కు విజన్ సిస్టమ్ బహూకరణ


శంకర్ ఫౌండేషన్‌కు బహూకరించిన ఆల్కాన్ విజన్ సిస్టమ్

ప్రజాశక్తి-పెందుర్తి, వేపగుంట : దేశంలో పారిశ్రామిక, వైద్య వాయువుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఐనాక్స్ ఎయిర్ ప్రొడక్ట్స్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా రూ.87 లక్షల విలువలో భాగంగా 50 లక్షల ఆర్థిక సహాయంతో ఆల్కాన్ కానస్టలేషన్ విజన్ సిస్టమ్‌ను శంకర్ ఫౌండేషన్‌కు విరాళంగా ఇచ్చినట్లు శంకర్ ఫౌండేషన్ డిజిఎం కె.బంగారురాజు తెలిపారు. ఈ పరికరాన్ని నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో విశాఖపట్నం ఐనాక్స్ రీజినల్ సేల్స్ మేనేజర్ ఎస్‌విఎస్.రాజు, శంకర్ ఫౌండేషన్ జిఎం కె.రాధాకృష్ణన్, రెటీనా విభాగం హెచ్‌ఒడి టి.కృష్ణ, డిజిఎం వి.రమేష్‌కుమార్ తదితరులు ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణ కుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్‌లో వైద్య, శస్త్రచికిత్సకు అత్యాధునిక కంటి పరికరాలను పెంచడంలో ఐనాక్స్ ఎంతో సహకరిస్తుందని తెలిపారు.

క్లాప్ ఆటో లోడర్ల నిరసన

ప్రజాశక్తి -గాజువాక : చెత్తను సేకరించే క్లాప్ ఆటో లోడర్లు, వర్కర్ల జీతాలు చెల్లించాలని కోరుతూ గురువారం మస్టర్ పాయింట్ల వద్ద నిరసన తెలిపారు. 10 నెలల నుంచి జీతాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా జీతంలో కోతలు పెడుతున్నారని, అడిగిన వారిని తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా లోడర్లు మాట్లాడుతూ, సూపర్‌వైజర్లకు జీతాలు ఇచ్చే వరకు తాము డ్యూటీకి వెళ్లేది లేదని చెప్పారు. మే 7వ తేదీ తరువాత జీతాలు వేస్తామని జివిఎంసి అధికారులు హామీ ఇచ్చారని, అప్పటి వరకు ప్రతిరోజూ బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లోడర్ల నాయకులు ధనరాజ్, చంటి, మహేష్ పాల్గొన్నారు.

నవోదయలో 'స్టార్ అకాడమీ' విద్యార్థి ప్రతిభ


ఉమేష్‌చంద్ర

ప్రజాశక్తి- ఉక్కునగరం : జవహర్ నవోదయ పరీక్షా ఫలితాల్లో ఎన్ఎడి కొత్తరోడ్డు బుచ్చిరాజుపాలెంలోని స్టార్ ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థి ప్రతిభ చాటారు. ఈ అకాడమిలో సైనిక్, నవోదయ పరీక్షలకు తర్ఫీదు పొందిన ఉమేష్‌చంద్ర (1065286)కు నవోదయ పరీక్షల్లో 96.25 మార్కులు సాధించారని ఎడ్యుకేషనల్ అకాడమి కరస్పాండెంట్ రాజా తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల జీతాలు పెంచాలని కోరుతూ గురువారం ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్, హైర్ బస్ డ్రైవర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ తమ సంఘంతో అద్దె బస్సు యజమానుల సంఘం 2022లో చేసిన ఒప్పందం కాలపరిమితి ముగిసి ఆరు నెలలు అవుతున్నా జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యుటి అమలు చేయాలని, యూనిఫామ్ అలవెన్స్ ఇవ్వాలని, 1/ 2019 సర్కులర్ అమలు చేయాలని, డ్రైవర్లపై వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, కాని కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ డ్రైవర్లతో సమానంగా పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల జీవితాలు మాత్రం దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న కారణాలతో తొలగింపులు చేస్తున్నారన్నారు. ఆర్టీసీ యాజమాన్యం బాధ్యత వహించి జీతాలు పెంపుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని, లేనియెడల కార్మికుల సమ్మెకు సిద్ధం అవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలక సత్యనారాయణ, డిపో కార్యదర్శి ఎంపీ నాయుడు, యూనియన్ కోశాధికారి వై.శివ, డి.రామకృష్ణ, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు



అడ్మిషన్ల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

ప్రజాశక్తి-సబ్బవరం : పిల్లల సమగ్ర వికాసానికి, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఒ ఎస్.లక్ష్మణరావు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. మండలంలోని బాటజంగాలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.తమ్మారావు ఆధ్వర్యాన ఐదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్, తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా ఎంఇఒ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు తయారు చేసిన అడ్మిషన్ల కరపత్రాన్ని, గోడ పత్రికలను గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన కోలాటం, జానపద నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తరగతుల వారీగా మంచి ప్రతిభ సాధించిన పిల్లలందరికీ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బోలెం శంకర్రావు, ఉపాధ్యాయులు వై.శిరీష, స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి, అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26 శనివారం ఉదయం 9 గంటలకు చోడ వరం గాంధీ గ్రామం గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ అధికారి గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 23 పైగా కంపెనీలతో మెగా జాబ్మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్మేళాలో బహుళజాతి కంపెనీలు పాల్గొంటున్నా యని తెలియజేశారు. జాబ్మేళాకు హాజరయ్యేవారు పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బి.టెక్, పి.జి, విద్యార్హతలు కలిగి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494791935, 7981102224 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in/user-registrationలో నమోదు చేసుకోగలరని జిల్లా నైపుణ్యా భివద్ధి అధికారి గోవిందరావు తెలియజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని నరసింగపల్లి సబ్ స్టేషన్ తాళ్లపాలెం ఫీడర్ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు కశింకోట ఈఈ రామకృష్ణ గురువారం తెలిపారు నరసింగపల్లి సబ్స్టేషన్ పరిధిలోని నరసింగపల్లి, జె.తుని, ఎన్ జి.పాలెం, త్రిపురువానిపాలెం, అచ్యుతాపురం చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినిపాలెం, పరవాడ పాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాల పాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసా పురం, సోమవరం, యేనుగుతుని, చిన్న యెనుగుతుని, జీ. భీమవరం, సింగవరం, అచ్చెర్ల,కోత అచ్చెర్ల, మొసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెప్పారు. తాళ్లపాలెం పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో మార్పు ఉంటుందని ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకూ, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు ఆయా గ్రామాలకు చెందిన వినియోగదారులు సహకరించవలసిందిగా ఈఈ కోరారు.

ఘనంగా జాజిమొగ్గల పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట జాజిమొగ్గల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు ప్రిన్సిపాల్ జాజిమొగ్గల శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు. విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

టెన్త్ మెరిట్ విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి

పదోతరగతి పరీక్షల్లో రికార్డు స్థాయి ఫలితాలను సాధించిన విద్యార్థులను కలెక్టర్ విజయాకృష్ణన్ అభినందించారు. 590కి పైగా మార్కులు సాధించిన జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తొమ్మిది మంది విద్యార్థులను గురువారం కలెక్టర్లోని తన చాంబర్లో ప్రత్యేకంగా అభినందించి మెమోంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 590 పైగా మార్కులను ప్రభుత్వ పాఠశాలలో చదివిన తొమ్మిది మంది విద్యార్థులు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. పరీక్షల నిర్వహణకు, రాష్ట్రస్థాయిలో ఐదోస్థానం సాధించేందుకు కృషి చేసిన జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడును, ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. పరవాడ మండలం పెదముసిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్సీ వెంకట జయ 595 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవగా, అచ్చుతాపురం ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని కోసూరు మౌనిక 593 మార్కులు, పరవాడ మండలం పెదముసిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లా అనుష్క 592 మార్కులు, పరవాడ మండలం తానాం ఎంజిపిఏపిబిసి రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని వాసిరెడ్డి వెంకటలక్ష్మి 592 మార్కులు సాధించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

విశాల్ మార్ట్ సెక్యూరిటీ గార్డుకు

బకాయి జీతం చెల్లించాలని ధర్నా



విశాల్ మార్ట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని మల్టీనేషన్ షాపింగ్ మాల్ విశాల్ మార్ట్లో సెక్యూరిటీ సర్వీసెస్లో పనిచేసిన ఈగల రామారావుకి చెల్లించాల్సిన రూ.34200 బకాయి జీతం తక్షణమే చెల్లించాలని కోరుతూ షాపు ముందు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు కనకల అప్పలరాజు మాట్లాడుతూ సెక్యూరిటీ సర్వీసెస్తో ఒప్పందంలో భాగంగా సెక్యూరిటీ సేవలు వినియోగించుకుందని, విశాల్ మార్ట్లో పనిచేసిన ఈగల రామారావుకి 57 రోజులు జీతం చెల్లించకుండా అన్యాయంగా విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. జీతాలు చెల్లించాలని పదేపదే కోరినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. కార్మిక శాఖ అధికారులు ఎదుట జాయింట్ మీటింగ్కు కూడా రాలేదన్నారు. తక్షణమే ఈగల రామారావు జీతాన్ని యాజమాన్యం చెల్లించాలని, యజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితుడు ఈగల రామారావు, బోడి రాజు, కళ్యాణం అప్పలనాయుడు, శంకర్రావు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితాలో తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు, అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నేతలు తమ దష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణరావు సూచించారు. కలెక్టరేట్లోని తన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో గురువారం మాసంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకా శాన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బూత్స్థాయి అధికారుల నియామకం, ఓటరు జాబితాలను నాణ్యత గా తయారు చేసేందుకు, మెరుగు పరిచేందుకు మరింత మంది బూత్స్థాయి అధికారులు, ఎలక్ట్రోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని డిఆర్ఓ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్, వాసు నాయుడు, ఉప తహసీల్దార్ రవి, టిడిపి పతినిధి బి.తాతయ్యబాబు, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, వైసీపీ ప్రతినిధి టి.షణ్ముఖ, ఆప్ ప్రతినిధి కె.హరినాథబాబు, సిపిఎం ప్రతినిధి జి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హులైన వారు ఈ నెల 28 నుంచి మే నెల 15వ తేదీ లోగా విద్యాశాఖ వెబ్సైట్ https://cse.ap.gov.in లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్ జయ ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. సీబీఎస్ఈ, ఐసిఎస్ఈ, ఐబి సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి మార్చి 31 నాటికి, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. అనాథ, హెచ్ఐవి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వారికి 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టిలకు 4 శాతం, వెనుకబడిన వర్గాలు, ఇతరులకు 6 శాతం సీట్లు లభిస్తాయని తెలిపారు. మే 16 నుంచి 20 తేదీ వరకు గ్రామ సచివాలయాల వద్ద ఉన్న డేటాతో పోల్చుకొని అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ కోసం తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు వోటర్ కార్డు, భూమి హక్కు పత్రం, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్పోర్టు, విద్యుత్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్తో పాటు జనన ధ్రువీకరణ పత్రం దరఖాస్తుతోపాటు సమర్పించాలని కోరారు. లాటరీ పద్ధతి ద్వారా మొదటి విడత ఫలితాలను మే 21 నుంచి 24 తేదీల మధ్య విడుదల చేస్తారని సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న ప్రకటించడం జరుగుతుందని, రెండో విడత ఫలితాలను జూన్ 6న చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 180042 58599 నెంబర్కు సంప్రదించాలని కోరారు.

మరిడిమాంబకు పంచకర్ల పూజలు

ప్రజాశక్తి-సబ్బవరం : నారపాడు పంచాయతీ శివారు బలిజపాలెం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండుగ అనుపు మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ఉదయం 5 గంటల నుంచి ధూప, దీప, నైవేద్యాలతో పాటు పూజలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్బాబు పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మామిడి శంకరరావు ఏర్పాటు చేసిన చీరలను ఆయన పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భరణికాన సాయినాథరావు, ఇందల వెంకటరమణ, పిబివిఎస్ఎన్ రాజు, వైస్ ఎంపిపి మామిడి లక్ష్మి కొండాజి, కర్రి కనకరాజు , దొడ్డి సూర్యప్రకాశరావు , గొర్లి నూకరాజు , బైలపూడి దేముడు, బంతి కోళ్ల పద్మ, జెట్టి ప్రసాద్, మంగరాజు, మండలం ఉమ్మడి ఎన్డిఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు, పంచాయతీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి దాడి ఎరుకునాయుడు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 2010 ఏప్రిల్ 24వ తేదీన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటికూరి రాజేష్, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని రేగుపాలెం పంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సర్పంచ్ రాజాన వెంకటమహాలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. క్లాప్ మిత్రలను సర్పంచ్ సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : పంచాయతీ వ్యవస్థ మెరుగుపరిచి ప్రజలకు మరింత సేవలు అందిస్తామని ఈవోపిఆర్డి బి.మహేష్ అన్నారు. పంచాయతీ దినోత్సవ సందర్భంగా చోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి నూకాలమ్మ, పంచాయతీ ఈవో నారాయణరావు, జనసేన నాయకులు జి మూలు నాయుడు, వార్డు సభ్యులు టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి కలగ లక్ష్మి గున్నయ్య నాయుడు, ఏఓ ఖాన్, హౌసింగ్ ఏఇ వెలగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు ఏవో కె.శివ నారాయణ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని మొగలిపురం, సబ్బవరం, బాటజంగాలపాలెం పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గండి అరుణ, దెడ్డం ప్రసాదరావు, పడాల వెంకటరమణ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపిటీసీ తమరాన సన్యాసమ్మ, పంచాయతీ సెక్రటరీ రజిని, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ ధర్మారావు, కో-ఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, ఎంఈఓ దివాకర్, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, చల్ల కనకరావు, బొద్దపు చిన్నారావు, పైల రాధాకృష్ణ, వర్రి హరి పాల్గొన్నారు.

మాడుగుల : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎఓ జీవిఎస్ గోపాల్ రావు, పంచాయతీరాజ్ జెఇఇ శ్రీనివాసరావు, యడ్ల హేమంత్‌కుమార్, సిహెచ్.సింహాచలం, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ డి.సురేష్ కుమార్, జొమ్మల నాగేశ్వరరావు, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ డి సీతారామరాజు ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి వీసం నానాజీ,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూల స్తంభాలు అని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ జయఉమాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ దినోత్సవాల్లో నాగయ్యపేట సర్పంచ్

దేవరాపల్లి : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్లో గురువారం నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవాల్లో నాగయ్యపేట సర్పంచ్ కర్రి పుష్ప పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా నుంచి 9 మంది సర్పంచులు పాల్గొనగా, వారిలో దేవరాపల్లి మండలం నాగయ్యపేట సర్పంచ్‌కు అవకాశం రావడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా నుంచి తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొనగా వీరిలో నాగయ్యపేట పంచాయతీ కార్యదర్శి కె.జీవన్‌బాబు ఉన్నారు.



రాష్ట్ర వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ పుష్ప



వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావును సన్మానిస్తున్న అతిథులు

ఉత్తమ సర్పంచ్‌గా లక్ష్మణరావుకు అవార్డు

ఆనందపురం : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ హరింధ్ర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి పాటుపడిన సర్పంచులను ఎంపిక చేయడంతో విశాఖ జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఎస్ఆర్.పురం సర్పంచ్, ఆనందపురం మండలం నుంచి ఉప్పాడ లక్ష్మణరావు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక పాల్గొని లక్ష్మణరావును సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : భూసమస్య పరిష్కారం కోసం వెళ్లిన తమపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి, కఠినమైన చర్యలు తీసుకోవాలని దేవరాపల్లికి చెందిన జాగరపు రాజునాయుడు, సోమిరెడ్డి అప్పలనాయుడు స్థానిక పిఎస్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. దేవరపల్లి సర్వే నెంబర్ 277/12 లో సుమారు 5.16 ఎకరాలకు సంబంధించి ఇరువర్గాల మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. కోర్టు వివాదం ఉన్నప్పటికీ వారు భూమిలోకి వెళ్లడంతో, సమస్యపై చర్చించేందుకు, వివాదం సామరస్యంగా పరిష్కరిం చేందుకు స్థానికులతో కలిసి సదరు భూమిలోకి గురువారం వెళ్లగా, తమపై వేరే వర్గానికి చెందిన ఐదుగురు వ్యక్తులు విచక్షణ రహితంగా దాడి చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను వికలాంగుడునని తెలిసినప్పటికీ దౌర్జన్యానికి పాల్పడి, నెట్టేసారని బాధితులు జాగరపు రాజునాయుడు పోలీసుల ఎదుట వాపోయాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇవిఎంల గోదాము తనిఖీ

ప్రజాశక్తి, అనకాపల్లి : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవిఎమ్) గోదామును జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. మాసంతపు తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్.పి. కార్యాలయం ఆవరణలో ఈవిఎం గోదామును తనిఖీ చేసి అక్కడ భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసునాయుడు, అనకాపల్లి స్టేషన్ ఫైర్ అధికారి, నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.తాతయ్య బాబు, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, వెసిపి ప్రతినిధి టి.షణ్ముఖ, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, సిపిఎం ప్రతినిధి జి. శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జన్మదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే జన్మదినోత్సవం సందర్భంగా పళ్ళు, పూల బొకేలు వద్దని, పేదవిద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు తీసుకురావాలని కోరటంతో ఆరోజు నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు పెద్ద ఎత్తున నోటు పుస్తకాలు తీసుకువచ్చారు. ఆ విధంగా సేకరించిన పుస్తకాలను నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. గురువారం ఎంఇఒ సత్యనారాయణ, డివిడి ప్రసాద్ మండలంలో ఉన్న 54 పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అందించారు.

కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజు పేట శివాలయం వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను జడ్పిటిసి దొండా రాంబాబు గురువారం ప్రారంభించారు. సర్పంచ్ విజయ్ కుమార్ కమ్యూనిటీ భవనం అవసరం అని జిల్లా జడ్పీటీసీ ఫోరమ్ అధ్యక్షులు దొండా రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.5 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయకుమార్, వైస్ ప్రెసిడెంట్ జగన్నాధరావు, మాజీ కో ఆపరేటివ్ చైర్మన్ ఎల్లపు గోవింద్, స్కూల్ వైస్‌చైర్మన్ శరగడం వెంకట అప్పారావు, పెంటకోట కృష్ణ. పెంటకోట గణేష్, బీశెట్టి నాగేశ్వరరావు, బీశెట్టి వెంకట జగ్గారావు, శరగడం ఆదిబాబు,డాక్టర్ మహాలక్ష్మి నాయుడు, బొడ్డేటి నూక అప్పారావు, ఎల్లపు చిరంజీవి గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- కాలిపోయిన గృహోపకరణాలు

ప్రజాశక్తి-వడ్డాది : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో స్థానిక కోవెల వీధిలో గురువారం కోవెల వెంకటరమణ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలన్నీ కాలి బూడిదయ్యాయి. గ్రైండర్ స్విచ్ ఆన్ చేసి ఉండడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటి యజమాని వెంకట రమణ ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో మంచాలు, టీవీ, గ్రైండర్, ఏసీ, ఇతరత్రా వస్తువులు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న పట్టణ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అగ్ని ప్రమాద వివరాలను రెవెన్యూ, విద్యుత్ అధికారులకు అందించారు.

టిడిపి సంస్థాగత కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన అనకాపల్లి మండలం చింత నిప్పుల అగ్రహారం, రేబాక గ్రామాలలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు గురువారం నిర్వహించారు. సిహెచ్ఎన్ అగ్రహారం గ్రామ టీడీపీ అధ్యక్షునిగా శరగడం ఆదిబాబు, ప్రధాన కార్యదర్శిగా గంట్ల సూరిబాబు, రేబాక గ్రామ టీడీపీ అధ్యక్షులుగా కోన నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కాపుశెట్టి అర్జునరావు ఎన్నిక కాగా, వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అగ్రహారం, రేబాక గ్రామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రేబాక సర్పంచ్ మార్పూరు సన్యాసమ్మ, తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసి నాయుడు(బాబి) పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని చెరకాం, తీడ గ్రామాలలో టిడిపి గ్రామ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. చెరకం అధ్యక్షులుగా బండారు అప్పారావు, కార్యదర్శిగా చుక్కా చిరింజీవి, తీడ అధ్యక్షులుగా మేడిశెట్టి సన్యాసి నాయుడు, కార్యదర్శిగా చిరికి సన్యాసినాయుడు ఎన్నికయ్యారు. ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, నాయకులు మురళి, గంటా నూకరాజు. గొంతిని శ్రీనివాసరావు, కాయల మురళి, వేగి గోపికృష్ణ; మాజీ సర్పంచ్‌లు చీటిమిరెడ్డి లక్ష్మి, కన్నూరు అక్కయ్యమ్మ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బాటజంగాలపాలెం పంచాయతీ టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక టిడిపి పెందుర్తి నియోజవర్గం ఇన్చార్జ్ గండి బాబ్జి ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మురకాడ వీర వెంకట అప్పలరాజు, ఉపాధ్యక్షుడిగా వనం సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శిగా కాపుశెట్టి వెంకట, కార్యనిర్వాహక కార్యదర్శిగా పందిరిపల్లి రాము, వాడపల్లి శ్రీనివాసరాజు, వనం పెద్ద సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులుగా వనం సత్యనారాయణ, రంగాల గోవిందమ్మ, నకిరి బోయిన గొరిష్, కోశాధికారిగా తాడి రమణ, బూత్ కమిటీల సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బర్నికాన బాబురావు, కుచర్లపాటి రామకృష్ణరాజు పాల్గొన్నారు.



ఎన్నికైన టిడిపి గ్రామ కమిటీ సభ్యులు

ఎంపిడిఒల ఉద్యోగోన్నతి కోటాలో అన్యాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన విడుదల చేసిన ఉత్తర్వుల్లో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల్లో సూపరింటెండెంట్‌లకు పదోన్నతి కోటాలో తీరని అన్యాయం జరిగిందని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు నల్లరిబ్బన్లతో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అప్పలరాజు మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో చేపట్టిన సంస్కరణలకు స్వాగతిస్తున్నామని అయితే ఎంపీడీవోల కోటా విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎంపీడీవో పదోన్నతుల విషయంలో 34 శాతం కోటా ఉండేది, ఈవోపిఆర్డికు 33 శాతం, డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ముప్పై శాతం ఇతరులకు మూడు శాతం ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన సంస్కరణలో భాగంగా అన్ని పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు నిర్ణయించినందున జిల్లా, మండల పరిషత్తుల్లో పనిచేస్తున్న మినిస్టీరియల్ సిబ్బందికి తీరని నష్టం జరుగుతుందన్నారు. 50 శాతం కోటాను పరిపాలన అధికారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చైతన్య స్కూల్ విద్యార్థులకు స్టడీటూర్

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చియ్యపేట మండలం వడ్డాది చైతన్య విద్యార్థులకు గురువారం స్టడీటూర్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిహెచ్ రాంబాబు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్, పోస్ట్ ఆఫీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కేజీబీవీ విద్యాలయంలను సందర్శించారు. సదరు కార్యాలయాలు పనిచేసే విధానం, ప్రజలకు అందించే సేవల గురించి సంబంధిత అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనివల్ల కొత్త విషయాలు తెలిసాయని విద్యార్థులు తెలిపారు.

న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం

-రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :రెల్లి కులస్తులకు న్యాయం చేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అన్నారు. గురువారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సి వర్గీకరణ ద్వారా సుప్రీం కోర్టు తీర్పుతో న్యాయం జరుగుతుందని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. అత్యంత వెనుకబడి, అసమానతలకు గురవుతున్న అంటరాని కులాలకు ప్రాధాన్యత కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ, రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఎస్సిలలో అభివృద్ధికి నోచుకోని కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పినా, రెల్లి కులానికి అన్యాయం చేయడం దారుణమన్నారు. సమావేశంలో నీలాపు వెంకటేశ్వరరావు, బంగారి తాతారావు, బంగారి లోవరాజు, భూపతి అప్పారావు, లీగల్ అడ్వైజర్ భగీరథరావు, స్టేట్ మహిళా అధ్యక్షురాలు ధనాల సుజాత, ఎర్రంశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని కోనాం ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతులతోపాటు విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులు నేపథ్యంలో ఈనెల 25న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ వెంకటరావు తెలిపారు. ఈ మేరకు కోనాం ఫీడర్‌లోని సిరిజాం, కోనాం, గుంటు, మంచాల, గుడివాడ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలు గ్రామాల్లో అమ్మవార్ల పండగలు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం గ్రామంలో నూకాలమ్మ, కొంతలం గ్రామంలో దుర్గాదేవి అమ్మవారి పండుగలను ఆయా గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవార్లను దర్శించుకొని చీర, పసుపు కుంకుమ, గాజులు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పండుగల సందర్భంగా గ్రామాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాడి రైతులకు రాయితీపై పశు దాణా

ప్రజాశక్తి- మాడుగుల : పాడి పశువుల దాణాను రైతులకు 50శాతం రాయితీతో అందుబాటులో ఉందని పశుసంవర్థకశాఖ మాడుగుల సహాయ సంచాలకులు డాక్టర్ వి. చిట్టి నాయుడు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు కేజీ ధర రూ. 22.21 కాగా, రూ.1100 విలువైన 50 కేజీల మిశ్రమ దాణా బస్తాను సగం రాయితీపై రూ.550లకు పాడి రైతులకు అందిస్తామన్నారు. ఒక్కో.పాడి రైతుకు ప్రస్తుతం 50 కేజీల నుండి 100 కేజీల వరకు రాయితీపై దాణా ఇస్తామరైతు సేవా కేంద్రాల ద్వారా కాని, పశు వైద్యశాలల్లో సిబ్బంది ద్వారా దాణా పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు రైతులు దగ్గరలోని పశువైద్యశాలను, రైతు సేవా కేంద్రంలో వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రజాభీష్టం లేకుండా పరిశ్రమలు వద్దు!

ప్రజాశక్తి- నక్కపల్లి : పరిశ్రమలు ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, ప్రజల అభీష్టం మేరకు గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వైసిపి మండల అధ్యక్షులు శీరం నరసింహమూర్తి అన్నారు. గురువారం మండలంలోని రాజయ్యపేటలో భూసేకరణ ప్రభావిత గ్రామాల్లో వైసిపికి చెందిన మత్స్యకార నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైజాగ్,చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట మండలంలోని రాజయ్యపేట, బోయపాడు, డిఎల్ పురం,అమలాపురం , మూలపర్ర, చందనాడ, బుచ్చిరాజుపేట తదితర గ్రామాల్లో ప్రభుత్వం ఎపిఐఐసి ద్వారా సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం పనులు చేపడుతున్నారని ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తారో, నిర్వాసితులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పకుండానే పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బల్క్ డ్రగ్స్ పార్క్, స్టీల్ ప్లాంట్ అని పనులు చేపడుతున్నారని, ప్రజల అభిప్రాయాలు సేకరించ కుండా పనులు చేపట్టడం సరికాదన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు న్యాయం చేయలేదని, డి పట్టా, సాగు భూముల్లో చెట్లకు ఇప్పటికీ పరిహారం చెల్లించలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే



మాట్లాడుతున్న వైసిపి నేత నరసింహమూర్తి

ఉపాధి కోల్పోనున్న మత్స్యకారులు, రైతులు, వివిధ వృత్తిదారులను ఏ విధంగా ఆదుకుంటారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులను అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా పరిశ్రమ స్థాపన కోసం పనులు చేపట్టడాన్ని వైసిపి పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిర్వాసితులకు అండగా నిలిచి, సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చినతీనార్ల పంచాయతీ సర్పంచ్ ఎరిపిల్లి ముసలయ్య, నాయకులు ఎరిపిల్లి నాగేష్, మెరుగు కొర్లయ్య, మైలపల్లి అప్పలరాజు, రాము,చేపల సోమేష్, లోకనాథం, పైడితల్లి పాల్గొన్నారు.

జాతీయ స్పెషల్ ఒలింపిక్స్ పోటీలకు బాలసరస్వతి



పతకాన్ని స్వీకరిస్తున్న బాల సరస్వతి

ప్రజాశక్తి-రావికమతం : జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత క్రీడాపోటీలలో రావికమతం వికలాంగ విద్యార్థిని బాల సరస్వతి ఎంపికైందని మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు బొడ్డు మహాలక్ష్మినాయుడు తెలిపారు. సమగ్ర శిక్ష, స్పెషల్ ఒలంపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత్ వికలాంగుల క్రీడా పోటీల్లో రావికమతం మండలం కెబిపి అగ్రహారం గ్రామానికి చెందిన మానసిక వికలాంగ విద్యార్థిని నక్కరాజు, బాలసరస్వతి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి బి. శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ అన్నపూర్ణ, స్పెషల్ ఒలంపిక్ భారత్ కమిటీ జాతీయ స్థాయి క్రీడ నిపుణులు రాజశేఖర్, నుంచి వెండి పతకం, సర్టిఫికెటును స్వీకరించింది. ఈ ఏడాది జూలైలో ఛత్తీస్‌గఢ్‌లో జరగబోవు జాతీయ స్థాయి వికలాంగుల స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడా పోటీలకు ఎంపికైందని మహాలక్ష్మినాయుడు తెలిపారు. మండలంలో కొత్తకోట గ్రామానికి చెందిన వికలాంగ విద్యార్థి మల్లేటి ఆనంద్ పరుగు పందెంలో తృతీయ స్థానం దక్కించుకొని కాంస్య పతకాన్ని సాధించాడన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు విజయవాడలోని తోటాడ పారడైజ్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ – 2025 క్రీడా పోటీల్లో మేధో వైకల్యం, ఆటిజం, డౌన్ సిండ్రోమ్, మస్తిష్క పక్షవాతం వైకల్యాలు గల ప్రత్యేక అవసరాల పిల్లలకు పోటీలు నిర్వహించగా, రాష్ట్రం నుంచి 14 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనకాపల్లి జిల్లా నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా, ఆరు పతకాలను సాధించారు. విద్యార్థులకు శిక్షణనివ్వడం, కోచ్‌గా వ్యవహరించిన మహాలక్ష్మినాయుడు, డిని, బుచ్చయ్యపేట ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్ పోలిరాజును సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, ఎంఇఓ, పలువురు అభినందించారు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనం

ప్రజాశక్తి -కోటవురట్ల : భూసార పరీక్షలతో మట్టిలో పోషకాల స్థాయి తెలుసుకొని అవసరమైన ఎరువుల మోతాదు నిర్ణయించుకోవడంతోపాటు పర్యావరణ కాలుష్యం నివారించుకోవచ్చునని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.ఉమాప్రసాద్ సూచించారు. గురువారం రాజుపేట గ్రామంలో ఎవొ శాఖ సిబ్బంది మట్టి నమూనా సేకరణ చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షలతో రైతులకు పలు విధాలుగా లాభాలు చేకూరుతాయని, ఈ పరీక్షలు ధర ఎరువుల మోతాదులు, పంటల రకాల ఎంపికతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడే పద్ధతుల గురించి రైతులందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు, నేలలో పోషకాలు సక్రమంగా ఉన్నప్పుడు మాత్రమే పంటలు దిగుబడి ఆశించిన విధంగా వస్తుందన్నారు. ఏ విధమైన ఎరువులు వాడాలి అనే విషయం తెలుస్తుందని, దీని ద్వారా ఖర్చులు, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు, ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 50 మట్టి నమూనాలు సేకరిస్తున్నట్టు తెలిపారు, కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు సరోజిని, బిసిటి శాస్త్రవేత్తలు శైలజ, శ్రీహరి, ప్రసాద్ నాగేంద్రప్రసాద్, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాపు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రేవతి

ప్రజాశక్తి - చీడికాడ : కాపు అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి రేవతిని నియమిస్తూ సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ (సికా) ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు వేల్పూరి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారని అనకాపల్లి జిల్లా సికా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తెలిపారు. అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం, అవినీతిని అంతం చేయడం, రాష్ట్ర, దేశ అభివృద్ధికి, కాపు, తెలగ, బలిజ, ఒంటరి, తూర్పు, మున్నూరు కాపు కులస్తులు పెద్దన్న పాత్రను బాధ్యతగా నిర్వహించాలని శ్రీనివాసులు సూచించారని శ్రీరామ్ తెలిపారు.

యూకలిప్టస్ తోటలు దగ్ధం

ప్రజాశక్తి-కొత్తకోట : రావికమతం మండలంలోని టి. అర్జాపురం గ్రామ సమీపంలో శాస్త్రి గారి మామిడి తోటకు చేరువలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు మడగల అర్జునకు చెందిన ఐదు ఎకరాల్లోని యూకలిప్టస్ తోట అగ్నికి ఆహుతి అయ్యింది. విశాఖకు చెందిన వ్యక్తి నుంచి ఐదు ఎకరాలను లీజుకు తీసుకొని దాంట్లో యూకలిప్టస్ తోట సాగు చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే రావికమతం అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాము. సకాలంలో వచ్చి మంటల్ని అదుపు చేసి ఉంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదెకరాల్లోని యూకలిప్టస్ తోటంతా కాలిపోయిందని ఆందోళన చెందారు. సుమారు రూ.10 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు మడగల అర్జున ఆవేదన వ్యక్తం చేశారు. వేరే చోట అగ్ని ప్రమాదం జరగడంతో అక్కడి నుంచి నీళ్లు నింపుకొని వచ్చేసరికి ఆలస్యం అయిందని, మంటలు మరింతగా వ్యాపించకుండా అదుపు చేసినట్లు అగ్నిమాపక అధికారి సాయి కుమార్ తెలిపారు.

నేవీ అధికారులకు 'గీతం' శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ : నెగోషియేషన్ స్కిల్స్ పెంచడానికి భారత నౌకాదళంలో పనిచేసే పరిపాలన అధికారులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన రెండు రోజుల మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ పరిశ్రమలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేస్తున్న అధికారులకు సమకాలీన అంశాలపై తాము శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత కార్పొరేట్ అవసరాలను, నూతన మేనేజ్‌మెంట్ అంశాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వల్పకాలిక శిక్షణలో భాగంగా ఉద్యోగస్తులకు అవగాహన కలిగించడం తద్వారా వారి వృత్తి, ఉద్యోగ జీవితంలో సమర్థంగా పనిచేసే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా మానవ వనరులను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగస్తులు, సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తూ వివిధ అంశాలలో చర్చలలో పాల్గొనవలసి ఉంటుందని, వ్యాపార సంబంధమైన ఆర్థిక లావాదేవీలకు నైపుణ్యంతో చర్చించి సరైన నిర్ణయాలను తీసుకోవడం కీలకం అని వీటిని నెగోషియేషన్ స్కిల్స్‌గా పరిగణిస్తారని తెలిపారు. న్యాయపరమైన అంశాలు, ఒప్పంద సమయంలో తీసుకోవలసిన నిర్ణయాలు, సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడం తదితర అంశాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ టి.సౌదామిని, డాక్టర్ తపస్సు బంత, ప్రొఫెసర్ వైవివివిఎస్ఎస్.వరప్రసాద్, ప్రొఫెసర్ సత్య వెంకటరావు పాల్గొని నౌకాదళ అధికారులకు దిశానిర్దేశం చేశారు.



కోటవురట్లలో వెలిగించిన కొవ్వొత్తులతో జనసేన నిరసన ప్రదర్శన

ఉగ్రదాడిపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : జమ్ము కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చాడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మృతులకు సంతాపం తెలియచేస్తూ అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం మౌన దీక్ష చేపట్టారు. నోళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, దూలం గోపి, అప్పికొండ గణేష్, మంగ ఈశ్వర్, భీశెట్టి సుధా, బర్నికాన శ్రీను పాల్గొన్నారు.

చోడవరం : ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ చోడవరం జనసేన పార్టీ నాయకులు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ పీవీఎస్ఎన్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : కాశ్మీర్ ఉగ్రదాడిపై యలమంచిలిలో కూటమి నేతలు నిరసన దీక్షలు చేపట్టారు. ఎమ్మార్వో కార్యాలయానికి ఎదురుగా మెయిన్‌రోడ్డుపై టెంటు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో లాలం సోమునాయుడు, రాజాన శేషగిరిరావు, అన్నం బాబ్జీ, గొర్లె శివనారాయణ, కరణం రవి, కొఠారి శ్రీనివాస రావు, లంక రాజు, లవుడు లోవరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడి మృతులకు సంతాపంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మూడు రోజుల సంతాప దినాలలో భాగంగా రెండో రోజు నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, పాము గణేష్, కురందాసు అప్పలరాజు, యలమంచిలి చంద్రరావు పాల్గొన్నారు.

కోటవురట్ల : కశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా గురువారం సాయంత్రం పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ బోడపాటి శివ దత్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు, దేశ సమగ్రతకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. పార్టీ జిల్లా సెక్రటరీ ఆకేటి గోవిందరావు, జాయింట్ సెక్రటరీ కురందాస్ అప్పలరాజు,బత్తుల బాబు రావు, కోనేటి రంగబాబు, తంగేటి శ్రీనివాసరావు,జవ్వాది బద్రి, పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ నర్సీపట్నం డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో జనసేన పార్టీ మౌన దీక్ష చేపట్టారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, పూడి చక్రవర్తి, అల్లాడ సురేష్, గండెం దొరబాబు, సలాదుల ప్రసాద్ బాబు, కోనా నారాయణరావు పాల్గొన్నారు.

చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీగా డిఎల్ పురం



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రామకృష్ణ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని డి ఎల్ పురం పంచాయతీ చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు విజయవాడలో గురువారం జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ నుంచి పంచాయతీ సర్పంచ్ కిల్లాడ రామకష్ణ, కార్యదర్శి వి. నరసింహారావు అవార్డును అందుకున్నారు.

టెన్త్‌లో మండల టాపర్‌కు అభినందన



నాగ్‌ను అభినందిస్తున్న జగన్నాథరావు

ప్రజాశక్తి -రావికమతం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 588 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన మండలంలో గుడ్డిప గ్రామానికి చెందిన నాగ్ జెడెక్‌ను రావికమతం మండల వైసిపి కన్వీనర్ కంచిపాటి జగన్నాథ రావు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రావికమతం మండలానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు టాపర్స్‌గా నిలవడం సంతోషకరమన్నారు. అదేస్ఫూర్తితో బాగా చదవి, మంచి ఉద్యోగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుడ్డిప సర్పంచ్ గుమ్మాల గణేష్ పాల్గొన్నారు.

8న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ పున:ప్రతిష్ట వచ్చేనెల 6 నుంచి 8 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ ఆహ్వానపత్రికలను గురువారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చేనెల 6న శైవ ఆగమ సంప్రదాయంలో తూర్పుగోదావరి జిల్లా పెడపర్తికి చెందిన యలమంచు కృష్ణమూర్తి శివాచార్య నేతృత్వంలో వేడుక జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు విగ్రహమూర్తుల ఊరేగింపు, రథయాత్ర జరుగుతుందన్నారు. 8న యంత్ర విగ్రహ ప్రతిష్ఠ,. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. వేడుకలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి, చింతకాయల విజయ్-సువర్ణ, రాజేష్, దివ్యశ్రీ దంపతులు పాల్గొంటారని ఆలయ కమిటీ తెలిపింది.

26న చేపల వేట నిషేధ భృతి పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈనెల 26న స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో మత్స్యకారులకు వేట నిషేధ పరిహారాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అందజేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెంకటేష్ తెలిపారు. గురువారం స్థానిక మత్స్యకార నాయకులతో కలిసి మత్స్యకార భరోసా పంపిణీ చేయు ప్రాంతాన్ని పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫిషరీస్ ఏడి ప్రసాద్‌తో సమావేశమై, పరిహారం పంపిణీ ఏర్పాట్లుపై చర్చించారు. జిల్లాలో 12 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుతుందని, రూ.24 కోట్లను మత్స్యకారులకు వేట నిషేధభృతిగా అందజేస్తారన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు..

భవన నిర్మాణ కార్మికుల ధర్నాలు



అనకాపల్లి కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ దరి లలిత జ్యూయలర్స్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారికోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ గత వైసిపి ప్రభుత్వం 1214 మెమో జారీచేసిందని, ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. గత ఎన్నికలకు ముందు టిడిపి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పి ఆ హామీని నేటికీ నెరవేర్చ లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని రాష్ట్రాల్లో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో అందుకు భిన్నంగా పరిస్థితి ఉందని తెలిపారు. తక్షణమే కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ మే 20న జరుగుతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు బలివాడ వెంకటరావు, అధ్యక్షులు పి.అనసూయ, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు రామునాయుడు, రాజశేఖర్, నాగేష్, రమణ, నర్సింగరావు, మసేన్, పెంటారావు, ఈశ్వరరావు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గురువారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను గత ప్రభుత్వం నిలిపివేయడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని చెప్పి 11 నెలలు కావస్తున్నా బోర్డు పునరుద్ధరణ చేపట్టలేదని తెలిపారు. కార్మికులకు ప్రమాదాలు జరిగినా ఆదుకునే పరిస్థితి లేదన్నారు. పిల్లల స్కాలర్షిప్‌లు, సంక్షేమ పథకాలు ఏవి అమలు కావడం లేదని, ఇన్సూరెన్స్ కూడా నేటికీ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ అమలు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి అప్పలనాయుడు, సిహెచ్.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర, కొండబాబు, నర్సింగరావు అప్పలరమణ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్లో వినతి పత్రం అందజేశారు.



నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన

నర్సీపట్నం టౌన్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది భవన్ నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును, అందులోని వందల కోట్ల రూపాయలను గత ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించిందన్నారు. 1214 మెమో విడుదల చేసి బోర్డును నిర్వీర్యం చేసి కార్మికులకు రావలసిన పథకాలు ఇవ్వకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే నేటికి పది నెలలైనా హామీ నెరవేర్చలేదన్నారు. ప్రమాదాల్లో కార్మికులు మరణిస్తున్నా ఆదుకునే నాథుడు లేకుండా పోయారన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు అడిగర్ల రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అదే జరిగితే దేశంలో 5 కోట్ల భవన నిర్మాణ కార్మికలు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీరామ, రమణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరేడుబందలో జ్వరాల జోరు

- అల్లాడిపోతున్న ఆదివాసీలు
- సిపిఎం, ప్రజాసంఘాల నిరసనలతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు



గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు శివారు నేరేడు బంద గ్రామంలో ఆదివాసీలు జ్వరాలతో అల్లాడిపోతున్నారని తక్షణమే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సిపిఎం, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. వెంటనే స్పందించిన కొత్తకోట పిహెచ్ సి. వైద్యాధికారిణి రజని ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు.


ఈ సందర్భంగా వైద్యాధికారిణి రజని మాట్లాడుతూ గ్రామంలో 11 ఇళ్లలో 56 మంది జనాభా కలిగి ఉన్నారని అందులో ఇద్దరికి సాధారణ జ్వరం కాగా ముగ్గురు వ్యక్తులకు దగ్గు, జలుబు, ఉన్నాయని, 37 మందికి కీళ్ల నొప్పులు, నీరసంతో ఉన్నట్టు గుర్తించామన్నారు. 12 మంది గర్భిణులకు పలు రకాల మందులు అందజేశారు. జ్వరాలతో బాధపడుతున్న 12 మందికి మలేరియా నిర్ధారణకు రక్త పరీక్షలు చేశామని తెలిపారు. ఎంపిహెచ్ఇఒ పి రామారావు, హెచ్ఎస్ రమణ, ఎఎన్ఎం కృష్ణవేణి, ఉషారాణి ఉన్నారు.

రికార్డుల్లో లేని నేరేడుబంద గ్రామం

నేరేడుబంద గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రయ్య, గెమిలి వాసు తదితరులు డిమాండ్ చేశారు. గురువారం కొత్తకోటలో విలేకరుల తో మాట్లాడుతూ గ్రామంలో 13 మంది చిన్న పిల్లలు జ్వరాలతో బాధపడుతుండగా, కిల్లో ప్రభాస్ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారన్నారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో ఈ గ్రామం పేరు లేకపోవడంతో మలేరియా నివారణకు స్ప్రేయింగ్, సరైన ఆరోగ్య సేవలు అందడం లేదన్నారు. గ్రామంలో అంగన్వాడీ, పాఠశాల, ఆశా కార్యకర్తలు లేరని వాపోయారు. సీజనల్‌లో జ్వరాలు విజృంభిస్తే డోలిమోతలతో మూడుకిలోమీటర్లు తీసుకొస్తేగానీ వైద్యం అందని పరిస్థితి ఉందని, దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు.

ఘనంగా ఐకానికా సిటీ ఆఫ్ గోల్డ్ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: రుషికొండ ఐటి హిల్ నెంబర్ 3 వద్ద నిర్మించనున్న మెగా హౌసింగ్ ప్రాజెక్టు ఐకానికా సిటీ ఆఫ్ గోల్డ్‌కు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి గురువారం శంకుస్థాపన చేసి, బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 97 ఎకరాల్లో నిర్మించనున్న సువిశాలమైన ఈ ప్రాజెక్టును వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌సిసి సంస్థ అనుభవజ్ఞులైన ఐకానికా రియల్ ఎస్టేట్ కంపెనీతో కలిసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కొత్తగా రానున్న టిసిఎస్, గూగుల్ వంటి దిగ్గజ ఐటి కంపెనీలు, టూరిజం, ఫార్మా ప్రాజెక్టుల వల్ల విశాఖలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని చెప్పారు. మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ గోవాను మించిన సముద్ర అందాలున్న విశాఖ రియల్ ఎస్టేట్‌కు గమ్యస్థానమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఐకానికా ప్రాజెక్ట్ చైర్మన్ కొట్టు మురళి మాట్లాడుతూ బెంగళూరు, హైదరాబాద్‌లలో వేల సంఖ్యలో ఫ్లాట్లు, విల్లాలు నిర్మించామని ఈ ప్రాజెక్ట్ విశాఖ నగరంలోనే కాక ఆంధ్రప్రదేశ్‌లోనే అతి పెద్ద టౌన్‌షిప్‌గా అవతరించనుందని తెలిపారు. ఇందులో అధునాతనమైన విలాసవంతమైన విల్లాలు రానున్నాయన్నారు. భవిష్యత్తులో ఇందులోనే హోటల్, హాస్పిటల్, ఐటి పార్కులు ప్రీమియం అపార్టుమెంట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రదేశం నగరానికి అతి ముఖ్యమైన నూతన కూడలిగా నిలుస్తోందన్నారు. సమీపంలో హాస్పిటల్స్, స్కూల్స్ వ్యాపార సంస్థలతో విశాఖ నగర అభివద్ధి క్యారిడార్‌గా విలసిల్లనున్నదన్నారు. ఐకానికా సిటీ మొదటి దశలో ఐకానికా సిటీ ఆఫ్ గోల్డ్ నిర్మిస్తామని ఇది పూర్తిగా అల్ట్రా లగ్జరీ విల్లాలతో అత్యంత ఆధునికంగా రూపొందించబడుతుందని తెలిపారు. ప్రతి విల్లా 100 శాతం వాస్తుతో ప్రపంచ శ్రేణి సౌకర్యాలను కలిగి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అంతర్జాతీయ ఆర్కిటెక్ట్ ఆర్ఎస్‌పి డిజైన్ వారిచే రూపకల్పన చేయబడిందన్నారు. 42000 చదరపు అడుగుల విలాసవంతమైన అద్భుతమైన క్లబ్ హౌస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లోని విల్లాల విస్తీర్ణం 4500 చదరపు అడుగుల వద్ద ఆరంభమై 10000 చదరపు అడుగులు వరకు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐకానికా ప్రాజెక్ట్స్ ఎమ్‌డి కెఎల్.సంతోష్, అల్లూరి రంగరాజు, అల్లూరి సీతారామరాజు, వేణు, కార్పొరేటర్ లొడగల అప్పారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చిన జీయర్‌స్వామి, పక్కనే ఎమ్మెల్యే గంటా